క్లుప్తంగా

వేడుకగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని సుందరంగా ముస్తాబు చేసి పల్లకీలో ఉంచి ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

దివ్యాంగులందరికీ స్కూటీలు పంపిణీ చేయాలి



దివ్యాంగుల సంక్షేమ అధికారిణికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

కోవెలకుంట్ల: నిబంధనలతో సంబంధం లేకుండా దివ్యాంగులందరికీ త్రీవీలర్ స్కూటీలు అందజేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉమ్మడి కర్నూలు జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారిణి ఫాతిమాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ.. డిగ్రీ అర్హత ఉండి 18 నుంచి 45 ఏళ్లలోపు దివ్యాంగులకు త్రీవీలర్ స్కూటీలు అందజేస్తామని ప్రభుత్వం నిబంధన విధించిందన్నారు. విద్యార్హతతో సంబంధం లేకుండా 50 ఏళ్లలోపు దివ్యాంగులందరికీ వీటిని అందజేయాలని కోరారు. సంఘం నాయకులు రమణ, సుబ్బరాయుడు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.


ముగిసిన రైల్వే యూనియన్ ఎన్నికలు

డోన్ రూరల్: పట్టణంలో మూడు రోజులుగా జరుగుతున్న రైల్వే యూనియన్ ఎన్నికలు శుక్రవారంతో ముగిశాయి. మొత్తం 646 మంది ఓటర్లు ఉండగా 535 మంది రైల్వే ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 83 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నెల 12వ తేదీ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె: మండలంలోని నందివర్గం 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ రూరల్ ఏఈ గర్జప్ప తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని నందివర్గం, చెరువుపల్లె, పండ్లాపురం, వెంకటాపురం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయానికి తెల్లవారుజామున 4 గంటల నుంచి 9 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు విద్యుత్ సరఫరా అందించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.


ముందస్తు క్రిస్మస్ వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రెవరెండ్ జేనియల్ జయంత్

డోన్: స్థానిక షాదీఖానాలో సుందర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ డాక్టర్ జేనియల్ జయంత్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రీస్తు జననం, మహిమలను వివరించారు.అనంతరం కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. నిర్వాహకుడు గూడపాటి ఇర్మియాను అతిథులు సత్కరించారు.

62 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కోవెలకుంట్ల: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుంచి శుక్రవారం మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆ శాఖ ఎస్ఐ సందీప్ తెలిపారు. సంజామలకు చెందిన భాస్కర్ బెల్ట్‌షాపు ద్వారా మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా సమాచారం మేరకు దాడి చేశామన్నారు. అతని వద్ద నుంచి వివిధ బ్రాండ్లకు చెందిన 62 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మార్గదర్శకుడు అంబేడ్కర్

- వాడవాడలా రాజ్యాంగ నిర్మాత వర్ధంతి
- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు



డోన్: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: దేశ ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్య్రాలు అనుభవించేందుకు అవిరళ కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ అని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు అన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దనున్న విగ్రహానికి నివాళులర్పించారు. రాజ్యాంగం ద్వారా లభించిన అనేక హక్కులను టీడీపీ పాలకులు కాలరాస్తున్నారని ఆరోపించారు. హక్కులను పరిరక్షించుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో కలిసి పోరాడేందుకు అందరూ కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ సోమేష్ యాదవ్, కౌన్సిలర్లు నాగేంద్ర, వంశీ, ఆర్ట్ రమణ, సుంకన్న, మౌలాలి, పాలుట్ల రఘురాం, వెంకట్రాముడు, కోఆప్షన్ సభ్యులు పాతపేట రఫి, కుమ్మరి రాజు, నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి, జగదుర్తి మోహన్‌రెడ్డి, రైల్వే ప్రకాష్, రాజు, వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే డోన్ డివిజన్ రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి మహబూబ్ బాషా, మజ్దూర్ యూనియన్ చైర్మన్ సుధాకర్, వైస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, నాగరాజు, బాషా, జయక్రిష్ణ, శేఖర్, నజీర్‌బాషా రైల్వేస్టేషన్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

బేతంచెర్ల: ఆదర్శమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీ ఆవరణలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ కోట్ల మధు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, గూని నాగరాజు, నడ్డిశ్రీను, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు. అలాగే మాలమహానాడు రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు బొల్లి మద్దిలేటి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి తాలుక రాజయ్య పుష్పాంజలి ఘటించారు.

–డోన్ టౌన్/డోన్ రూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల రాముడు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మోటారాముడు, గోపాల్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. రాజ్యాంగం కల్పించిన గిరిజన హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. వెంకటేష్, రామయ్య, సుంకయ్య, నాగేష్ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో గుండాల ఈశ్వరయ్య, పులి కేశవయ్య, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మద్దిలేటి, ఉన్నిగోర్ల జనార్దన్, సుంకన్న పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని స్మారక జీవీ కొండారెడ్డి లైబ్రరీలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, స్థానిక వాసవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, పరంధామ నిలయంలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాసంఘాల నాయకులు కరీ ంబాషా,వడ్డె సుబ్బరాయుడు, రామచంద్రరాజు, అప్పపోగు వెంకటసుబ్బయ్య, లింగన్న, ఓబులేసు, మద్దిలేటి,రాముడు,వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అవుకు: మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఆయన్ను స్మరించుకున్నారు. జై భీమ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల దేవరత్నం, ఆవుల సుధాకర్ బాబు, సత్యం, చిన్న వెంకటయ్య, జయచంద్ర, ఆస్కర్, వినయ్, కుమార్, ప్రేమ్‌కుమార్, ఆనంద్, దేవరాజు పాల్గొన్నారు.

ప్యాపిలి: అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేద్దామని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సుందరం, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ డైరెక్టర్ శ్యాంసన్ అన్నారు. స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.మత్తు బాబా సాహెబ్, నరసింహులు, తిమ్మప్ప, తలారి హనుమన్న పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్: స్థానిక మాలమహానాడు కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేడం సుబ్బరాయుడు ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు.







అవుకు: మెట్టుపల్లెలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి, బేతంచెర్ల: నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్, కోవెలకుంట్లలో..





ప్యాపిలి: రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దార్,బేతంచెర్ల: ఆర్.కొత్తపల్లెలో రెవెన్యూ సదస్సు

భూసమస్యలపై అర్జీల స్వీకరణ

- గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

బనగానపల్లె రూరల్: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని యాగంటిపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు విచారణ చేసి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ.. అర్జీలను ఆన్‌లైన్ చేసి 45 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా సీఎం రిలీఫ్ ఫండ్ కోసం సంతకం చేయడానికి స్థానిక వీఆర్వో రూ.2 వేలు లంచం డిమాండ్ చేసినట్లు మహిళ ఫిర్యాదుతో సస్పెండ్ చేయాలని జేసీకి సిఫార్సు చేశారు. డోన్ ఆర్డీఓ నరసింహులు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ పాల్గొన్నారు.



బనగానపల్లె: అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కొలిమిగుండ్ల: మండలంలోని పెద్దవెంతుర్ల, కమ్మవారిపల్లె గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి నెలకొన్న భూవివాదాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్యాపిలి: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భారతి తెలిపారు. మండల పరిధిలోని మెట్టుపల్లి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ గ్రామాల రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు.

డోన్ రూరల్: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఉంగరానిగుండ్ల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తహసీల్దార్ కె.నాగమణి, ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌కొత్తపల్లె, ఆర్.బుక్కాపురంలో ప్రత్యేక అధికారి బషీరున్నీసా బేగం, తహసీల్దార్ ప్రకాశ్‌బాబు, ఎంపీటీసీ మునేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ నాగరాజు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

సంజామల: ముదిగేడు గ్రామంలో తహసీల్దార్ అనీల్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ తులసి కృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అవుకు: మండల పరిధిలోని రామాపురం గ్రామంలో మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మండల సర్వేయర్ హరి, ఆర్ఐ వెంగల్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు స్పందన కరువు

కోవెలకుంట్ల: గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు రైతుల నుంచి స్పందన కరువైంది. శుక్రవారం కోవెలకుంట్ల మండలంలోని అమడాలలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఏడుగురు రైతులు మాత్రమే సదస్సుకు వచ్చి తమ పొలాలను ఆన్‌లైన్ చేయాలని అర్జీలు అందజేశారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సదస్సులను రైతులు పెద్దగా పట్టించుకోకపోవడంతో మొక్కుబడిగా కొనసాగింది. అనంతరం తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి మౌలిక వసతులపై ఆరా తీశారు. ఇన్‌చార్జ్ ఆర్ఐ పుల్లయ్య, వీఆర్ఓ మురళీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అమడాలలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న తహసీల్దార్

శతాధిక వృద్ధురాలికి సన్మానం

కోవెలకుంట్ల: పట్టణంలోని సంతపేటలో నివాసం ఉంటున్న సుబ్బమ్మకు వందేళ్లు నిండడంతో కోవెలకుంట్లకు చెందిన ప్రకృతిపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి మాట్లాడుతూ.. జీవితం అంటే నూరేళ్ల పంట అనే నానుడిని సుబ్బమ్మ అవ్వ నిరూపించిందన్నారు. జీవన పరీక్షలో వంద మార్కులు సాధించి జన్మను సార్థకం చేసుకుందన్నారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా వారితోపాటు వారి మనువళ్లు, మనవరాళ్లకు పెళ్లిళ్లు చేసి మూడు తరాలను చూసిందన్నారు. వందేళ్ల వయస్సులో కూడా తన పనులు తాను చేసుకుంటూ ఎంతో ఆరోగ్యంగా ఉందని పేర్కొన్నారు. శతాధిక వృద్ధురాలిని శాలువాతో సన్మానించారు. ప్రకృతిపీఠం సభ్యులు పల్లె సుబ్బలక్ష్మమ్మ, రాములమ్మ, నారాయణస్వామి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



సుబ్బమ్మను సన్మానిస్తున్న ప్రకృతిపీఠం సభ్యులు

రోడ్డు నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ముదిగేడు చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, అవుకు, తదితర పట్టణాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్‌సీ, లైసెన్స్, తదితర రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

సాయం చేయడం సామాజిక బాధ్యత

డోన్ టౌన్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం సామాజిక బాధ్యత అని ఎంఈఓ ప్రభాకర్ అన్నారు. వరద బాధితుల సహాయార్థం మండలంలోని గోసానిపల్లె పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు అనుగోలు సంజీవరాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు విరాళాలు సేకరించారు. శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ పేరుపై తీసిన చెక్కును ఎంఈఓ ప్రభాకర్‌కు అందించారు.

సభను జయప్రదం చేయాలి

కోవెలకుంట్ల: అరుణోదయ 50 వసంతాల సభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు కరీంబాషా కోరారు. స్థానిక జీవీ కొండారెడ్డి స్మారక గ్రంథాలయంలో శుక్రవారం సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 14, 15వ తేదీల్లో హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ జరుగుతుందన్నారు.

రుద్రవరంలో స్థల వివాదం

బేతంచెర్ల: మండల పరిధిలోని రుద్రవరం గ్రామంలో సామూహిక మరుగుదొడ్డి స్థలం విషయంపై శుక్రవారం వివాదం నెలకొంది. గ్రామంలో 60 ఏళ్లుగా ఎస్సీ కాలనీ మహిళల అధీనంలో ఉన్న స్థలం తనదేనని అదే కాలనీకి చెందిన మద్దిలేటి మరుగుదొడ్డిని గత ఏడాది కూల్చి వేయించాడు. ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నించడంతో మహిళలు అడ్డుకున్నారు. ఎస్ఐ రమేష్ బాబు విచారణ చేశారు.

వైభవంగా మద్దిలేటిస్వామి కల్యాణోత్సవం

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో మార్గశిర మాసం పంచమి తిథిని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామివారిని కొలువుంచి మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బాల్యవివాహాలతో భవిష్యత్తును బలిచేయొద్దు

డోన్: బాల్య వివాహాలతో పిల్లల భవిష్యత్తును బలి చేయవద్దని.. బాల్య వివాహాలు చేసినా.. ప్రోత్సహించినా చట్టప్రకారం శిక్షార్హులవుతారని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం కిశోరి వికాసం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. తల్లిదండ్రులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించాలన్నారు. చిన్నతనంలో పెళ్లిళ్లు చేయడం వల్ల శారీరంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు వస్తాయని తెలిపారు. డీపీఎల్ఓ నరసింహారెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న అన్ని అనర్థాలకు బాల్య వివాహాలే మూల కారణమని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్, ఐసీడీఎస్ అధికారిని షంషాద్‌బేగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రామేశ్వరి, జూనియర్ కాలేజీ లెక్చరర్ పద్మావతి, ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



కిశోరి వికాసం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి తంగమణి

దంపతులపై దాడి.. 16 మందిపై కేసు


బేతంచెర్ల: మండల పరిధిలోని రుద్రవరం గ్రామానికి చెందిన దాసరి మద్దిలేటి, మహేశ్వరి దంపతులపై అదే గ్రామానికి చెందిన ఎరుకలి సరోజతో పాటు మరో 15 మంది దాడి చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మద్దిలేటి, మహేశ్వరి గ్రామంలోని ఓ స్థలంలో బండలు నాటుతుండగా ఎరుకలి సరోజతోపాటు మరో 15 మంది ఇది మీ స్థలం కాదు, ప్రభుత్వ స్థలం అని వారితో గొడవ పెట్టుకుని దాడి చేశారన్నారు. బాధితుడు దాసరి మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

కేబుల్ కేటుగాళ్లు

- పొలాల్లో విద్యుత్ తీగలే టార్గెట్



తిమ్మనాయినపేటలో కట్ చేసిన కేబుల్‌ను చూపుతున్న రైతు,




స్టార్టర్ వద్ద కట్ చేసిన విద్యుత్ తీగ

కొలిమిగుండ్ల: జల్సాల కోసం కొందరు దుండగులు వ్యవసాయ మోటర్లకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ తీగలను చోరీ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయంలో పెట్టుబడుల భారం అధికం కావడంతో అవస్థలు పడుతున్నారు. ఇలాంటి సమయంలో కేబుల్ దొంగలు వ్యవసాయ మోటర్లనే టార్గెట్ చేయడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సాధారణంగా దొంగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ పెట్టుకుంటారు. అయితే ఈ దొంగలు మాత్రం సులువుగా డబ్బులు వస్తాయనే దురాశతో కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. కొద్ది రోజుల నుంచి మండలంలోని పలు గ్రామాల్లో పొలాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్ల వద్ద కేబుల్‌పై గురిపెట్టారు. ఇటీవల కొలిమిగుండ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలోని చీని, అరటి, మామిడి తోటల్లో నలుగురు రైతులకు చెందిన విద్యుత్ తీగలను కట్ చేశారు. అక్కడే నిప్పు పెట్టి కాపర్‌ను తీసుకెళ్లారు. తాజాగా రెండు రోజుల క్రితం తిమ్మనాయినపేటలో 13 మంది రైతులకు చెందిన మోటర్ల వద్ద విద్యుత్ తీగలను అపహరించారు. స్టార్టర్ నుంచి మోటర్ వరకు అమర్చుకున్న విద్యుత్ తీగ మీటర్ రూ.120 పడుతుంది. ఒక్కో రైతుకు పది నుంచి పదిహేను మీటర్ల వరకు కేబుల్ అపహరణకు గురైంది.

ప్రైవేట్ పాఠశాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

డోన్: పట్టణంలోని శ్రీసుధ పాఠశాల యాజమాన్యం తన కుమారుడు షేక్షావలిని ఫీజు కట్టాలని వేధిస్తూ పాఠశాల నుంచి గెంటివేశారని జంగాల కాలనీకి చెందిన దివ్యాంగుడు ఫక్రుద్దీన్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ రాజకుమారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 1 నుంచి 5వ తరగతి నిరుపేద విద్యార్థులకు రైట్ టు ఎడ్యుకేషన్(ఆర్‌టీఈ) పథకం కింద ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు కల్పిస్తూ జారీ చేసిన జీఓను కోర్టు కొట్టివేసిందనే నెపంతో ఫీజు చెల్లించాలని తమను వేధిస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం అందించే పింఛన్‌తో బతుకుతున్న తన కుటుంబం ఫీజు ఎక్కిడి నుంచి తెచ్చి కట్టాలని ఆవేదన వ్యక్తం చేశాడు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి



సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎల్‌డీపీఓ

కొలిమిగుండ్ల: సచివాలయ సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలని నంద్యాల డివిజనల్ అభివృద్ధి అధికారి శివారెడ్డి అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల–1 సచివాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శోభారాణితో కలిసి సచివాలయ సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. పీజీఆర్ఎస్, ఏపీ సేవ, ఆధార్ క్యాంపులు, ఎంఎస్ఎంఈ సర్వే, కిశోర్ బాలికా వికాసం పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ–శ్రమ్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఎప్పటి పనులు అప్పుడే పూర్తి చేయాలని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో కాశినాయన ఆరాధనోత్సవం



హోరాహోరీగా సాగుతున్న రాతిదూలం పోటీలు

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ క్రాస్ వద్ద వెలసిన కాశిరెడ్డినాయన 29వ ఆరాధనోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆశ్రమంలో సకలదేవతల హోమం, పూర్ణాహుతి, అభిషేకాలు, అర్చనలు చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచా శీలారెడ్డి, పోచా శంకర్ రెడ్డి, చంద్రమౌళీశ్వర్ రెడ్డి, పోచా వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. చెక్కభజనలు, కాశీవేశం, కోలాటాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు

ఆరాధనోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎద్దుల రాతిదూలం పోటీలు హోరాహోరీగా సాగాయి. బాపట్ల జిల్లాకు చెందిన ఆర్‌కే వృషభాలు 3,900 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. నంద్యాల మండలం పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు 3758 అడుగులు, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వెంకట సాయి రెడ్డికి చెందిన ఎద్దులు 3641 అడుగులు, అదే జిల్లాకు చెందిన రావ్ చరణ్, ఓబుల రెడ్డికి చెందిన ఉమ్మడి జత 3,600 అడుగులు, కర్నూలు జిల్లాకు చెందిన గిడ్డయ్య నాయుడు ఎద్దులు 3,416 అడుగులు లాగాయి. విజేతలకు నిర్వహకులు చంద్రమౌళీశ్వర్ రెడ్డి, పోచా శీలా శంకర్ రెడ్డి వరుసగా రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు.



కాశిరెడ్డినాయనను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి